RNI. No. TELTEL /2022/ 89348



మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 4 సంచిక : 143 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | ఆదివారం, మే,24, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## మోదీతో మార్కో రూబియో కీలక చర్చలు..
## అమెరికా రావాలని ఆహ్వానం

**- నాలుగు రోజుల భారత పర్యటనలో రూబియో-భద్రత, వాణిజ్యం సహా కీలక రంగాలపై చర్చ-యుద్ధం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం**



**న్యూఢిల్లీ,మే 23:**నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్–అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. మరోవైపు ఇరాన్ ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చల్లో పాల్గొన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్ భేటీ అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రధాని మోదీతో సమావేశం అద్భుతంగా సాగింది. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో అమెరికా–భారత్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. ఈ రంగాలు ఇరు దేశాలను పటిష్ఠం చేయడమే కాకుండా.. స్వేచ్ఛా, బహిరంగ ఇండో–పసిఫిక్ రీజియన్‌ను ముందుకు తీసుకెళతాయి. అమెరికాకు భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి" అని పోస్ట్ చేశారు. ప్రపంచ శాంతి భద్రతలపై చర్చించినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన శాంతి చర్చలు విఫలం కావడంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి ట్రంప్ యోచిస్తున్నారనే వార్తల నడుమ ఈ భేటీ జరిగింది. చర్చల్లో భాగంగా ఇరాన్ సంక్షోభం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయని మోదీ పేర్కొన్నారు.

## టీటీడీ తరహాలో
## యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ

**వేద పాఠశాల సముదాయానికి సీయం రేవంత్ భూమిపూజ**





యాదాద్రి :యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. వేద పాఠశాలతో పాటు టెంపుల్ సిటీ పరిధిలో రూ. 99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ఈ సందర్భంగా శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానంతరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రూ. 43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ వేద పాఠశాలలో సంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్యను అందించనున్నారు. ఈ సముదాయంలో హోమాలు, యాగాలు నిర్వహించడానికి ప్రత్యేక శాలలతో పాటు ఒక గోశాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. వేద పాఠశాలకు భూమిపూజతో పాటు రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం, కొండపై స్వామివారి నిత్య కల్యాణాల నిర్వహణ కోసం రూ. 9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం, భక్తుల సౌకర్యార్థం వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ. 1.41 కోట్లతో రక్షణ పైకప్పు (కానోపీ) నిర్మాణం, రథశాల వైపు వాయవ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

## తమిళనాడులో పదేళ్ల బాలిక హత్య..

**-కోయంబత్తూర్‌లో ఘటన-కిరాణా సామాన్లకు వెళ్లిన చిన్నారి కిడ్నాప్, హత్య-నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు-ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి - కొత్త ప్రభుత్వంపై డీఎంకే విమర్శలు-నేరుగా పర్యవేక్షిస్తున్న రాష్ట్ర డీజీపీ**



చెన్నై, మే 23:తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఘోరం జరిగింది. సూలూరు ఏరియాలో కిరాణా సామాన్లు తేవడానికి వెళ్లిన పదేళ్ల బాలిక కిడ్నాప్‌కు గురైంది. ఆపై ఆ చిన్నారిని దుండగులు దారుణంగా హత్య చేశారు. శుక్రవారం చెరువు సమీపంలో మృతదేహం దొరికింది. ఈ ఘటనపై తమిళనాడు కొత్త సీఎం విజయ్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అమానవీయ చర్యలను అస్సలు సహించబోమని స్పష్టం చేశారు. "ఈ ఘోర ఘటన దిగ్భ్రాంతిని, వేదనను కలిగించింది. ఇలాంటి అమానవీయ నేరాలను సహించబోం. కుటుంబ సభ్యులకు నా సానుభూతి. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేశారు. సమగ్రంగా విచారణ జరిపి తక్షణమే చార్జ్‌షీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించాం. మహిళలు, పిల్లలపై ఇలాంటి ఘోరాలకు ఒడిగట్టే వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా తమిళనాడు ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుంది" అని విజయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఈ హత్య రాష్ట్రంలో పెద్ద రాజకీయ దుమారం రేపింది. కొత్త ప్రభుత్వంపై ప్రతిపక్ష డీఎంకే తీవ్ర విమర్శలు చేసింది. సీఎం విజయ్ పదవి చేపట్టిన 12 రోజుల్లోనే నేరాలు పెరిగాయని ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. మరోవైపు గత డీఎంకే ప్రభుత్వమే వ్యవస్థను నాశనం చేసిందని బీజేపీ విమర్శించింది. ఈ కేసులో కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణను వేగవంతం చేయడానికి తమిళనాడు డీజీపీ స్వయంగా కోయంబత్తూర్ వెళ్లారు. సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు మృతదేహాన్ని తీసుకోబోమని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆసుపత్రికి వెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

## 10 సెమీకండక్టర్ యూనిట్లు ప్రపంచాన్ని
## శాసించబోతున్నాయి

**ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ,మే 23:**రాబోయే రోజుల్లో భారత్ కు చెందిన 10 సెమీకండక్టర్ యూనిట్లు ప్రపంచాన్ని శాసించబోతున్నాయని ప్రధాని మోడీ ధీమా వ్యక్తం చేశారు. 19వ రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశ యువతకు ప్రధాని కీలక సందేశాన్ని ఇచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) నిర్మాణమే లక్ష్యంగా దేశంలోని ప్రతి భారతీయుడు ఒక గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతున్నాడని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని చేరుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ రంగాలలో భారీగా పెట్టుబడులు పెడుతోందని, ఈ వ్యూహాత్మక పెట్టుబడుల వల్ల యువతకు మిలియన్ల కొద్దీ సరికొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించబడుతున్నాయని ప్రధాని మోడీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ పారిశ్రామిక వృద్ధి లో భాగంగా నేడు భారతదేశంలో పూర్తి స్థాయి సెమీకండక్టర్ ఉత్పాదక సరఫరా గొలుసు వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి వెల్లడించారు. రాబోయే సంవత్సరాల్లో భారతదేశానికి చెందిన 10 ప్రధాన సెమీకండక్టర్ యూనిట్లు ప్రపంచవ్యాప్తంగా తమ ప్రత్యేక ముద్రను వేయబోతున్నాయని, ఈ యూనిట్ల విజయానికి అత్యధిక బలం భారతీయ యువత నుండే లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మన యువత తమ మేధస్సు, ప్రతిభ, నిబద్ధత ద్వారా ప్రపంచ వేదికపై సరికొత్త రికార్డులను సృష్టిస్తారని, ఈ సెమీకండక్టర్ విప్లవం వల్ల దేశంలో అపారమైన ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయని ఈ సందర్భంగా ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు.


## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో
## సీఏల పాత్ర కీలకం

**- ఐసీఏఐ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్-చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచన-సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని ఆకాంక్ష**



**హైదరాబాద్,మే 23:**భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర అత్యంత కీలకంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ, చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచించారు.సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాలానుగుణంగా కృత్రిమ మేధ (ఏఐ)ని వృత్తిలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. మున్ముందు పన్నులు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో సీఏల అవసరం చాలా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని మరవకూడదని సూచించారు.

## మాసబ్‌ట్యాంక్‌లో దారుణం.. ప్రముఖ న్యాయవాది మృతి



హైదరాబాద్: మాసబ్‌ట్యాంక్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ న్యాయవాది కాజా మొయినుద్దీన్‌ను గుర్తుతెలియని దుండగులు కారుతో ఢీకొట్టి హత్య చేసిన ఘటన సంచలనం రేపుతోంది. శనివారం ఉదయం ఆయన తన నివాసం నుంచి కారులో బయల్దేరుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ధుండగులు కారుతో ఢీ కొట్టి అటాక్ చేశారు. ఈ ప్రమాదంలో మొయినుద్దీన్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఘటన తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. దాడికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై
## కాంగ్రెస్ సర్కార్‌కు కేటీఆర్ వార్నింగ్

**- రైతుల మరణాలపై సీఎం రేవంత్‌ను నిలదీసిన బీఆర్ఎస్ నేత- కేబినెట్ పెండింగ్ కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వానికి సూచన**



**హైదరాబాద్,మే 23:**తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ఆలస్యంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రభు త్వ వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలాయని, అన్నదాతలు రోడ్డున పడుతున్నా పాలకుల్లో చలనం లేదంటూ మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పల మీదే రైతన్నలు గుండెలు ఆగి కుప్పకూలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "రైతులు రాలిపోతున్నా చలనం లేని రాక్షస పాలన సాగుతోంది. అన్నదాతల చావులను చూసి ఆనందిస్తున్నావా ముఖ్యమంత్రి?" అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా నిలదీశారు. మండుటెండల్లో ఐయక కేంద్రాల (కొనుగోలు కేంద్రాల) కాడ రైతుల గుండెలు ఆగిపోతున్నా, ఈ కర్కశ ప్రభుత్వానికి కనీసం కనికరం కలగడం లేదా అని ప్రశ్నించారు. పంటలు కొనకుండా ఇంకెంత కాలం రైతులను యాతన పెడతారని, ఇంకెన్ని చావులు కావాలి, ఇంకెన్ని కుటుంబాలు రోడ్డున పడాలో చెప్పాలని అడిగారు. ప్రభుత్వ తీరును విమర్శిస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "దున్నపోతు మీద వానపడ్డట్టు ప్రవర్తించడం ఆపండి" అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, మంత్రులు సోయి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఈరోజు జరగబోయే కేబినెట్ భేటీలోనైనా ధాన్యం కొనుగోలు అంశంపై చిత్తశుద్ధితో చర్చించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పంట కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు, తక్షణమే ధాన్యం సేకరించి అన్నదాతల తిప్పలు తప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సంపాదకీయం

## నియోజకవర్గాల పెంపు ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

ఉమ్మడి ఏపీలో 2014 వరకు 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 42 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 175 స్థానాలు.. తెలంగాణకు 119 స్థానాలు వెళ్లాయి. అదే సమయంలో లోక్ సభ స్థానాల అంశాన్నే తీసుకుంటే.. ఏపీకి 25 స్థానాలు.. తెలంగాణకు 17 స్థానాలు కేటాయించారు. విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచుతామని చెప్పారు. ఈ లెక్కన ఏపీ అసెంబ్లీలో ఉన్న 175 స్థానాలకు 225 స్థానాలు పెరగాలి. తెలంగాణలో.. ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు 150కు పెరుగుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఏపీ రాష్ట్ర వాటా 4.08 శాతం. ఆ నిష్పత్తి ప్రకారం ఏపీకి వచ్చే లోక్ సభ స్థానాలు 33 మాత్రమే.తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కడ పెరుగుతాయి..? తగ్గే సీట్లు ఎక్కడ తగ్గుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద నగరాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో తగ్గొచ్చనేది అంచనా. అలా జరిగితే.. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే తెలంగాణ జనాభా 3.60 కోట్లు కాగా.. జీహెచ్ఎంసీ జనాభానే కోటి పైగా ఉంది. కాబట్టి ఇక్కడ సీట్లు పెంచక తప్పదు. గతంలో పునర్విభజన జరిగినప్పుడు కూడా హైదరాబాద్‌లో సీట్లు పెరిగిన సంగతిని సీనియర్లు గుర్తుచేసుకుంటున్నారు..ఏతావాతా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నగర ప్రాంతాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గుతాయనేది ప్రముఖంగా వినిపిస్తున్న మాట. అలా జరిగితే అర్బన్ ప్రాంతాల్లో పట్టున్న పార్టీలకు, నేతలకు అడ్వాంటేజ్ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. తద్వారా గ్రామీణ ఓటర్ల కంటే అర్బన్ ఓటర్లను ఆకట్టుకోవటానికి పార్టీలు, నేతలు ఎక్కువ ప్రయత్నాలు చేస్తారనడంలో సందేహం అక్కర్లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పార్టీలన్నీ తమ బలాబలాలు, ట్రాక్ రికార్డ్, ఓట్ల శాతం, పట్టున్న ప్రాంతాల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. దాన్ని బట్టి భవిష్యత్ రాజకీయ వ్యూహం ఖరారు చేసుకునే పనిలో పడొచ్చని నేతలు భావిస్తున్నారు. పార్టీలకు మాత్రం స్వతహాగా మహిళల్లో అనుకూలత లేదు. కొన్నింటికైతే తమ తప్పు లేకుండానే ప్రత్యర్థుల చాతుర్యం కారణంగా మహిళా వ్యతిరేకులనే ముద్ర పడిపోయింది. ఇప్పటికిప్పుడు ఆ ముద్ర చెరిపేసుకోవడం కుదురుతుందా అనేది కొత్త టెన్షన్. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్లు అమలు కాకుండానే.. ఎన్నికల్లో గెలుపోటములకు మహిళా ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో నారీశక్తి ఘనంగా పనిచేసింది.2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు.



నియోజకవర్గాల పునర్విభజనలో అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల ఆధారంగా లోక్‌సభ స్థానాలను పునర్విభజించాలన్న నిబంధన పెట్టారు. ఈ లెక్కన ముందు అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 27,41,239 మంది జనాభా ఉన్నారు. ప్రాథమికంగా అందుతున్న సమాచారం, జరుగుతున్న ప్రచారం మేరకు ప్రతి 2లక్షల జనాభాకు ఒక సీటు పెరిగే అవకాశం ఉంది. ఇక లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26 లేదా 27 అయ్యే అవకాశాలున్నాయి. జనాభా లెక్కల ఆధారంగా ఏర్పాటు చేస్తే అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువ ఎంపీ సీట్లు పెరుగుతాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ స్థానాలు, పునర్విభజన అనంతరం 14 లేదా 15 అయ్యే అకాశాలున్నాయి. వీటిలో 33 శాతం కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 5 స్థానాలు మహిళలకు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ స్థానాలను కలుపుకొనే మహిళల రిజర్వేషన్ కల్పిస్తారు. అంటే రిజర్వేషన్ పురుషులు, మహిళలు అని మారుతూ ఉంటుంది. దీంతో రాజకీయంగా కొత్త వారికి అవకాశాలు వస్తాయి. పురుషులతోపాటు మహిళలు అవకాశాలు అందిపుచ్చుకొనే వీలు ఉంటుంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వచ్చే ఎన్నికల నాటికి అధికారాన్ని అందుకోవాలని తెగతాపత్రయపడుతోంది. ఇలాంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజనను అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా వ్యవహరించే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. కానీ రాష్ట్రంలో తమకు ఉన్న సంస్థాగత బలం.. ఉపయోగపడుతుందనేది బీఆర్ఎస్ లెక్కగా ఉంది. తెలంగాణలో ప్రస్తుతం 17 పార్లమెంటు నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్, బీజేపీ 2024 ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు చొప్పున గెలుచుకున్నాయి. 1971 జనాభా లెక్కల ప్రకారం 1972లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తర్వాత? నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. కానీ? కొన్ని పరిధులు, పేర్ల మార్పుతో 2009లో ఎన్నికలు జరిగాయి. జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజక వర్గాల పునర్విభజన ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. కానీ ఇప్పుడు కేంద్రం మాత్రం 2011లో చేసిన జనగణన ఆధారంగా డీలిమిటేషన్‌కు రెడీ అయింది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి

# మెడికల్ బోర్డు ఓ మోసం

### - పబ్బం గడుపుతున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు
### - రెగ్యులర్ మెడికల్ బోర్డు కావాలి - కొత్త బావుల పేరిట సింగరేణి దగా
### - టీబీజీకేఎస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి ధ్వజం




తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మే 23:కార్మికుల సమస్యలకు సంబంధించినటువంటి విషయాలలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు మంత్రులను, సీ అండ్ ఎండి ని, అదికారులను అందర్నీ కలిసామని చెప్పుకుంటూ పాత ఫోటోలను పోస్ట్ చేస్తూ త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం జరుగుతాయని చెప్పుకుంటూ కార్మికులను మోసం చేస్తున్నరని, కార్మికులందరూ
ఇట్టి విషయాన్ని గమనించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 23న జరిగే మెడికల్ బోర్డు నేనంటే నేను పెట్టించానని గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. అసలు ఇది రెగ్యులర్ మెడికల్ బోర్డు కాదని మూడున్నర సంవత్సరాల నుంచి వేచి చూస్తున్నా 32 మంది సంబంధించిన బోర్డు అని ఆయన తెలియజేశారు రెండు సంవత్సరాలకు ముందు అప్లై చేసుకున్న వారందరినీ పిలిచే రెగ్యులర్ బోర్డు కావాలని కార్మికుల ఎవరు కార్మికులందరూ రెగ్యులర్ మెడికల్ బోర్డు కోరుకుంటున్నారన్నారు. కానీ ఇదే రెగ్యులర్ బోర్డ్ అని చెప్పుకుంటూ వీరందరూ కార్మికులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు కొత్త బావుల పేరిట ప్రభుత్వం మరియు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కార్మికులను మోసం చేస్తున్నారని ఇవన్నీ పాత మైన్స్ ఎక్స్టెన్షన్ పర్మిషన్స్ మాత్రమే వచ్చాయన్నారు. కొన్నిటికి గతంలోనే పర్మిషన్లు వచ్చాయని దీనిపైన కూడా కొత్త బావుల పేరిట ఆసత్య ప్రచారాలు చేసుకుంటున్నారని తెలిపారు. కార్మిక సోదరులందరూ, యువత అంత గమనించాలని పేర్కొన్నారు.మారుపేర్ల సమస్య కూడా తీవ్ర జాప్యం చేస్తూ లీగల్ ఒపీనియన్ పేరిట తాత్సారం చేస్తున్నారని, పదో తరగతి పాస్ గాని డిపెండెంట్ లకు విజిలెన్స్ పేరిట వేధించే సర్క్యులర్లను వెంటనే నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య, నాయకులు అయిలి శ్రీనివాస్, జావేద్ పాషా, చెల్పూరి సతీష్, చల్లా రవీందర్ రెడ్డి, బేతి చంద్రయ్య, అబ్దుల్ గని, దూట శేషగిరి, జనగామ మల్లేష్, అడ్డగట్ల గోపి, పుల్పాక శంకర్, రామ్ రెడ్డి, నూతి రాజకుమార్, మహేష్, కొప్పుల శ్రీనివాస్, కళాధర్ రెడ్డి, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తీస్ కా... జబర్దస్త్? ఆహారం రంగుల లోకపు..!!

### - ప్యాకెట్లలో...రుచికరమైన విషాలు!- డబ్బాలలో బందీ అయిన పోషకాలు...మన శరీరానికి ముప్పు!- తాజా పండ్లు, పచ్చని కూరలను తిందాం



(తెలంగాణ అవతరణ ప్రతినిధి మార్కండేయ కాలనీ) కనిపించని రసాయనాలతో...కరిగిపోయే తీపి రుచులతో...నవ్విస్తుంది ప్యాకెట్ ఫుడ్... ఆనారోగ్యాన్ని చేతిలో పెడుతుంది నిల్వ ఉండే పది కాలాలు...మనల్ని చేర్చే వ్యాధుల పాతాలు దూరం చేయండి ప్రాసెస్ ఫుడ్ ను.. చేరదీయండి ప్రకృతి ఆహారాన్ని ఆహారం...రంగుల లోకపు ప్యాకెట్లలో...రుచికరమైన విషాలు దాగున్నాయి...త్వరితగతినే సిద్ధమయ్యే ఈ ఆహారాలు,మానవ ఆరోగ్యాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి....డబ్బాలలో బందీ అయిన పోషకాలు,మన శరీరానికి చేసేవి ఎంతో మోసాలు!తాజా పండ్లు, పచ్చని కూరలను తిందాం,ఆరోగ్యకరమైన జీవితాన్ని సొంతం చేసుకుందాం ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి...? నేటి ఆధునిక జీవనశైలిలో భాగమైన ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి హైదరాబాద్ యువత ఆరోగ్యాన్ని నిలువునా ముంచేస్తోంది. నగరంలోని 18 నుంచి 24 ఏళ్ల లోపు కాలేజీ విద్యార్థులపై ఐసీఎమ్ఆర్ -- నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ శాస్త్రవేత్తలు తాజాగా నిర్వహించిన పరిశోధనలో నమ్మలేని, భయానక నిజాలు వెలుగులోకి వచ్చాయి.చిన్న వయసులోనే ప్రాణాంతక వ్యాధుల.అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ విపరీతంగా తినడం వల్ల చిన్న వయసులోనే ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. కేవలం రుచి, తక్కువ ధర, సులభంగా దొరుకుతుందనే కారణంతో యువత వీటిని ఎగబడి తింటున్నారు. కానీ.. ఈ అలవాటు వారి జీవితకాల ఆరోగ్యాన్ని, ముఖ్యంగా గుండె పనితీరును ప్రమాదంలోకి నెడుతోందని శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్లేట్‌లోకి విషం..! మీరు అమితంగా ఇష్టపడే ప్యాకెట్ స్నాక్స్, చాక్లెట్లు, రంగురంగుల షుగర్ డ్రింక్స్, పిజ్జాలు, బర్గర్లు నేరుగా మీ ప్రాణాల మీదకు తెస్తున్నాయని ఈ స్టడీ హెచ్చరిస్తోంది. ఈ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ ఎక్కువగా తీసుకునే యువతలో రక్తపోటు ముప్పు సాధారణం కంటే మూడు రెట్లు అధికంగా పెరుగుతోంది. ఇది అంచనా కాదు.. శాస్త్రవేత్తలు 311 మంది కాలేజీ విద్యార్థులపై క్లినికల్ పరీక్షలు చేసి తేల్చిన నిప్పులాంటి నిజం.అధ్యయనంలో ఏం తేలాయంటే.పరీక్షించిన వారిలో 12.5 శాతం మంది యువతకు ఇప్పటికే హై బీపీ ఉన్నట్లు తేలింది. 20 ఏళ్లు కూడా నిండని వయసులో బీపీ రావడం భవిష్యత్తులో పక్షవాతం, కిడ్నీ వైఫల్యానికి దారితీస్తుంది. ఈ కెమికల్స్, నిల్వ పచ్చళ్లు, ప్రాసెస్డ్ ఫుడ్స్ వల్ల రక్తనాళాలు పూడుకుపోయి, చిన్న వయసులోనే గుండెపోటు వచ్చే అవకాశాలు వంద శాతం పెరుగుతున్నాయి. రుచి కోసం వాడే మోనోసోడియం గ్లుటామేట్ (అజినోమోటో), అధిక సోడియం, శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ యువతను వీటికి బానిసలుగా మారుస్తున్నాయి.మారకపోతే ముప్పే.ఈ ప్రమాదం నుంచి యువతను రక్షించాలంటే కాలేజీల స్థాయిలో ప్రత్యేక ఫుడ్ అవేర్‌నెస్ కార్యక్రమాలు అత్యవసరమని ×జవీ=–చీ×చీ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇంట్లో వండిన సాంప్రదాయ, ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వకపోతే.. రాబోయే తరం ముసలితనం రాకముందే మంచాన పడక తప్పదని హెచ్చరిస్తున్నారు. ప్రాణం మీదకు తెచ్చుకునే కంటే.. నాలుక రుచిని నియంత్రించుకోవడం ఈ క్షణం నుంచే అవసరం.

## ఇకపై గ్రీన్‌కార్డు నిబంధనలు కఠినతరం..

**వాషింగ్టన్,మే 23:**అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) పొందాలనుకునే తాత్కాలిక వలసదారులకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇకపై గ్రీన్‌కార్డు దరఖాస్తుల ప్రక్రియ కోసం వలసదారులు తమ స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ స్పష్టం చేసింది. అయితే, ఈ కఠిన నిబంధనల నుంచి తాజాగా కొన్ని కీలక మినహాయింపులను కూడా ప్రకటించింది. అమెరికా జాతీయ ప్రయోజనాలు లేదా ఆర్థిక ప్రయోజనాలకు ఉపయోగపడే వలసదారులకు మాత్రమే ఈ నిబంధనల నుండి మినహాయింపు లభిస్తుందని పేర్కొంది. జాతీయ మీడియా సమాచారం ప్రకారం.. ఇప్పటివరకు అమెరికాలో స్టూడెంట్, టూరిస్ట్ లేదా తాత్కాలిక వర్క్ వీసాలపై ఉన్న విదేశీయులు దేశం విడిచి వెళ్లకుండానే 'అడ్జస్ట్‌మెంట్ ఆఫ్ స్టేటస్' ద్వారా గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కానీ, కొత్త విధానం ప్రకారం దీనికి భిన్నంగా మార్చారు. అంటే అత్యంత అరుదైన, అసాధారణ పరిస్థితుల్లో తప్ప మిగిలిన వారంతా తమ మాతృదేశంలోని అమెరికా ఎంబసీ లేదా కాన్సులేట్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వలస చట్టాల దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికే ఈ నిర్ణయం

# చనిపోయిన హోం గార్డ్‌కు నివాళులు అర్పించిన పెద్దపల్లి డీసీపీ



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోం గార్డ్ బి.శ్రీనివాస్ నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలుసుకున్న పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్‌తో కలిసి గోదావరిఖని శ్రీనగర్ కాలనీ (వినాయక్ నగర్)లోని ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... 1996 సంవత్సరంలో హోంగార్డ్‌గా ఎంపికైన బి.శ్రీనివాస్ గత 30 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో నిబద్ధతతో, నిజాయితీతో ప్రజా సేవలో అహర్నిశలు శ్రమించారని తెలిపారు.ఆయన ఆకస్మిక మరణం పోలీస్ శాఖకు, కుటుంబ సభ్యులకు, సహచర సిబ్బందికి తీరని లోటని పేర్కొన్నారు.ఆయన సేవలను చిరస్థాయిగా స్మరించుకుంటామని, కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం, ఓర్పు కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని డీసీపీ తెలిపారు. పోలీస్ శాఖ తరఫున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10,000 చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి,రామగుండం సీఐ కృష్ణ,హోంగార్డ్ ఆర్ఐ పెద్దన్న,ఎంటీవో మల్లేశం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## దంపతుల ఆదర్శ నిర్ణయం..! పెళ్లి రోజున నేత్ర, అవయవ దానానికి అంగీకారం

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)సమాజానికి ఆదర్శంగా నిలిచే నిర్ణయం తీసుకుంటూ గోదావరిఖనికి చెందిన భద్రకాళి ఫ్లెక్సీ ప్రింటర్స్ అధినేత గంధం మల్లేశం -- మంజుల దంపతులు తమ 35వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మరణానంతరం నేత్రాలు, అవయవాలను దానం చేయాలని ప్రకటించారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దంపతులను శాలువాతో సత్కరించి అభినందన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి సందేశమిచ్చేలా నేత్ర, అవయవ దానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి నిర్ణయాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో లింగమూర్తి, కే.ఎస్. వాసు, నల్లవెల్లి శంకర్, పందిళ్ల శ్యామ్‌సుందర్ పాల్గొని దంపతుల నిర్ణయాన్ని అభినందించారు. కార్యక్రమంలో దంపతుల కుమారుడు వినోద్‌కుమార్, కుమార్తె నవ్యశ్రీ పాల్గొన్నారు.






# మరో ఇద్దరికి వెలుగైన హోంగార్డ్ శ్రీనివాస్..!

## - కన్నీళ్ల మధ్య నేత్రదానం - నివాళులర్పించిన డీసీపీ, ఏసిపి, సీఐలు, హోంగార్డులు - భార్య చేతుల మీదుగా అంతిమ వీడ్కోలు









(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) పోలీస్ డ్రెస్‌లో మూడు దశాబ్దాలపాటు ప్రజా సేవ చేసిన ఓ హోంగార్డ్... చివరికి తన మరణానంతరం కూడా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపాడు. ఇంటి ముందర విషాదం ముసురుకున్నా, కన్నీరే కళ్లల్లో నిండినా... "అతని చూపు మరో ఇద్దరిలో బతికుండాలి" అన్న కుటుంబ సభ్యుల నిర్ణయం అందరినీ కదిలించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శ్రీనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకింది.గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న బుట్టి శ్రీనివాస్ (51) శుక్రవారం రాత్రి అకాల మరణం చెందాడు. ఆ వార్త తెలిసిన క్షణం నుంచి ఇంటి వద్ద విషాదం అలుముకుంది. భార్య జ్యోతి, తల్లి లింగమ్మ గుండెలవిసేలా విలపించారు. తోటి హోంగార్డులు, కాలనీ ప్రజలు, బంధువులు ఇంటి వద్దకు చేరుకుని కన్నీటి నివాళులు అర్పించారు. అలాంటి క్లిష్ట సమయంలో మాజీ కానిస్టేబుల్, సదాశయ ఫౌండేషన్ జిల్లా సలహాదారుడు, మృతుని దగ్గరి బంధువు దేవి లక్ష్మీనర్సయ్య కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. "శ్రీనివాస్ చూపు మరో ఇద్దరిలో బతికే ఉంటుంది" అన్న మాట భార్య, తల్లి మనసులను తాకింది. తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ వారు గొప్ప మనసుతో నేత్రదానానికి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు ఆధ్వర్యంలో, ఐ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. మరణానంతరం కూడా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపిన శ్రీనివాస్‌కు అక్కడున్న ప్రతి ఒక్కరూ నివాళు లర్పించారు.

"మా శ్రీనివాస్ సేవలను ఎప్పటికీ మర్చిపోలేం.."

శ్రీనివాస్ మృతదేహానికి డీసీపీ రాంరెడ్డి స్వయంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ...1996లో హోంగార్డ్‌గా చేరిన శ్రీనివాస్ గత 30 ఏళ్లుగా నిజాయితీతో, నిబద్ధతతో ప్రజా సేవలో పనిచేశారని గుర్తు చేశారు. ఆయన మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. పోలీస్ శాఖ తరఫున కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఏసీపీ రమేష్, సీఐలు ఇంద్రసేనా రెడ్డి, కృష్ణ, హోంగార్డ్ ఆర్ఐ పెద్దన్న, ఎంటీవో మల్లేశం, తోటి హోంగార్డులు కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్ సేవలను స్మరించుకుంటూ గౌరవ వందనం సమర్పించారు.

భర్తకు భార్యే అగ్గిపట్టిన వేళ

ఈ ఘటనలో ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది మాత్రం చివరి ఘట్టం. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మృతదేహం ముందు జ్యోతి విలపించిన తీరు అక్కడున్నవారి హృదయాలను కదిలించింది. "నన్ను చదివించి లెక్చరర్ చేశాడు... నా జీవితాన్ని నిలబెట్టాడు..." అంటూ ఆమె రోదించిన మాటలు వినగానే చాలామంది కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. శవయాత్రలో భర్తకు అగ్గిపట్టుకొని భార్య జ్యోతి ముందుకు నడిచిన దృశ్యం చూసి కాలనీ ప్రజలు, తోటి హోంగార్డులు మౌనంగా కన్నీరు మున్నీరయ్యారు. జీవితాంతం తోడుగా ఉంటానన్న వ్యక్తికి చివరి వీడ్కోలు ఇస్తూ ఆమె వేసిన ప్రతి అడుగు అక్కడ విషాదాన్ని మరింత గాఢం చేసింది. శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడున్న ప్రతి హృదయం భారంగా మారింది. అయితే తన చూపుతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపిన శ్రీనివాస్ మాత్రం అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

# తడి చెత్త పొడి చెత్త స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 38వ డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాము



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)స్థానిక శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ రామగుండం లో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహించే తడి చెత్త పొడి చెత్త స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 38వ డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాము సీతానగర్ లో తడి చెత్త పొడి చెత్త కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది గౌరవ శాసనసభ్యులు గతంలో చెప్పిన విధంగా స్వచ్ఛ రామగుండం అనేది ప్రతి ఇంటి నుంచి ప్రతి ఇల్లు పునుకొని చేయవలసిన కార్యక్రమం పొడి చెత్త తడి చెత్తని ఒక డబ్బాలో పొడి చెత్తని మరొక డబ్బాలో వేసి నేరుగా చెత్త సేకరించే వాహనాలలో వేయాలని చెప్పి గతంలో చెప్పిన విధంగా గౌర ఎమ్మెల్యే గారి ఆదేశానుసారం చెప్పిన మాట ప్రకారం ఈరోజు లి38 డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాముli గారు ఇంటి వద్దకు వెళ్లి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ స్వచ్ఛ రామగుండంలో భాగంగా ప్రతి ఒక్కరు ఇలా భాగస్వాములు అవ్వాలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చెత్తని నేరుగా చెత్త వాహనాలలోనే వెయ్యాలని ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ యూసుఫ్, వాట్ ఆఫీసర్ సాయి, డివిజన్ అధ్యక్షులు పంజాల ఆంజనేయులు, వాడు అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.



# చట్టాన్నిఎవ్వరు చేతిలోకి తీసుకోవద్దు ...సోషల్ మీడియా వదంతులు నమ్మొద్దు: పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి

## ముస్లిం, హిందు, క్రిస్టియన్ మత పెద్దలతో పోలీసుల శాంతి సమన్వయ సమావేశం



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను పరస్పర సహకారంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ యంత్రాంగం అన్ని రకాల చర్యలు చేపట్టిందని డిసిపి తెలిపారు . గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో ముస్లిం, హిందు, క్రిస్టియన్ మత పెద్దలతో పోలీసుల శాంతి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.డిసిపి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమాజంలో మత సామరస్యం, ఐక్యతతో అన్ని వర్గాల ప్రజలు ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవిస్తూ, సోదరభావంతో బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. పసువులను తరలించే వాహనాలను అడ్డుకోవడం, వ్యక్తులపై దాడులు చేయడం, బలవంతంగా తనిఖీలు చేయడం చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు. ఎక్కడైనా అనుమానాస్పద వాహనాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పండుగ నేపధ్యంలో ఎలాంటి అపోహలు, వదంతులు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దు, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దు అని తెలిపారు . ప్రభుత్వం అనుమతించిన నిర్ణీత ప్రదేశాల్లోనే జంతువధ (ఖుర్బానీ) నిర్వహించాలి. బహిరంగ ప్రదేశాలలో జంతు అవశేషాలను పారవేయకుండా, పరిశుభ్రత పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఏదైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారులు దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో గోదావరిఖని ఏ సిపిఎం రమేష్,గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి , ఎస్ ఐ లు రమేష్ మనోహర్ .అనుష హిందూ ముస్లిం క్రిస్టియన్ మత పెద్దలు పాల్గొన్నారు.

# రూ. 88.60 కోట్లతో మెరుగైన మంచి నీటి సరఫరా పనులు చేపడుతున్నాం :మేయర్ మహంకాళి స్వామి



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మే 23: రూ 88.60 కోట్ల అర్బన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్( యు ఐ డి ఎఫ్ ) నిధులతో నగరంలో నీటి సరఫరా మరింత మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. ఈ మేరకు శనివారం పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం, మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పాటు సంబందిత కాంట్రాక్టర్ తో ఆయన సమీక్షించారు . ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సరఫరా అభివృద్ధి పనుల్లో భాగంగా కొత్తగా నిర్మించబోయే ఎనిమిది ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్లకు స్థలం గుర్తించాలని మునిసిపల్ ఇంజనీరింగ్ , పట్టణ ప్రణాళికాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన స్థలాలు గుర్తించిన పక్షం లో ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ సహకారంతో ఆయా సంస్థల ఉన్నత అధికారులతో సంప్రదించి స్థలం కేటాయిశీచేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు నీటి సరఫరా ఇవ్వని లేదా పాక్షిక నీటి సరఫరా ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు , పి . కె , రామయ్య కాలనీ లాంటి ప్రాంతాల్లో ఇ ఎల్ ఎస్ ఆర్ నిర్మించినట్లయితే లింగాపూర్ , మేడిపల్లి తదితర ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ప్రాజెక్ట్ లో భాగంగా 76 కిలో మీటర్ల మేర డిస్ట్రీ బ్యూషన్ పైప్ లైన్ నెట్ వర్క్ నిర్మించడం జరుగుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని లీకేజీలు కాకుండా నాణ్యతతో డి ఐ పైప్ లైన్ వేసినట్లయితే ఎక్కువ కాలం మన్నిక గా ఉండే అవకాశాలు ఉన్నందున ఆ దిశగా ఆలోచన చేయాలని మేయర్ అన్నారు. పనులు త్వరగా ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రామగుండం నగర పాలక సంస్థ ఎస్ ఇ గురువీర , పబ్లిక్ హెల్త్ డి ఇ నరసింహా స్వామి , మున్సిపల్ డి ఇ జగదీశ్వర్ , ఎ ఇ లు మీర్ , మనోజ్ , మౌనిక , కోయ కన్స్ట్రక్షన్స్ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధి రావత్ తదితరులు పాల్గొన్నారు



## వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త
# రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ



మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టు కోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉ ండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కుచాలా కీలకంగా మారింది.ఒకవేళ ఈచిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



# కమల్-రజనీ మూవీలో త్రిష



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.


# 70లోనూ యంగ్ హీరోలకు పోటీ.. చిరంజీవి న్యూ లుక్



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి వయసు పెరుగుతున్న కొద్దీ మరింత యంగ్‌గా కనిపిస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. 70 ఏళ్ల వయసులోనూ అదే ఎనర్జీ, అదే గ్లామర్‌తో కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు చిరు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఆయన సినిమా భారీ విజయాన్ని అందుకుని బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపింది. దాదాపు రూ.400 కోట్ల వసూళ్లతో మెగాస్టార్ మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకున్నారు. ప్రస్తుతం దర్శకుడు కేఎస్ రవీంద్ర దర్శకత్వంలో చిర నటిస్తుండగా, ఈ సినిమా కోసం చిరంజీవి పూర్తిగా కొత్త మేకోవర్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలు దీనికి నిదర్శనంగా మారాయి. లేత తెలుపు రంగు పోలో షర్ట్‌లో చిరంజీవి ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. స్లిమ్ ఫిట్ లుక్, యంగ్ స్టైల్‌తో ఆయన తన వయసులో సగం ఉన్నట్లుగా కనిపిస్తూ అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు “చిరంజీవి వయసు రివర్స్‌లో వెళ్తుందా?” అంటూ కామెంట్లు పెడుతున్నారు. చిరంజీవి ఫిట్‌నెస్ వెనుక ఉన్న క్రమశిక్షణ కూడా ప్రత్యేకమే. ఆయన దృష్టిలో ఫిట్‌నెస్ అంటే కేవలం శారీరక దృఢత్వం మాత్రమే కాదు, మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమని భావిస్తారు. అందుకే ఎప్పుడూ స్ట్రెస్ ఫ్రీగా, ప్రశాంతంగా కనిపిస్తుంటారు. ఆహారపు అలవాట్ల విషయంలో కూడా ఎంతో జాగ్రత్తగా ఉంటారు. ఎక్కువగా వెజిటేరియన్ హై ప్రోటీన్ ఫుడ్, సలాడ్స్, సూప్స్ తీసుకుంటారని సమాచారం. షూటింగ్ ఎక్కడ ఉన్నా ఇంటి నుంచే భోజనం తెప్పించుకోవడం ఆయన అలవాటు. అలాగే ప్రతిరోజూ వర్కవుట్స్, యోగా, ప్రాణాయామం తప్పకుండా చేస్తుంటారు. ఉదయం 4 గంటలకే లేచి రెండు గంటల పాటు వ్యాయామం చేసిన తర్వాతే ఇతర పనుల్లో పాల్గొంటారని సినీ వర్గాలు చెబుతున్నాయి. పాత్రకు తగ్గట్లుగా తనను తాను మార్చుకోవడంలో

చిరంజీవి ఎప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు. ఇక బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ సినిమాకు 'కాకా' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అలాగే మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ కీలక పాత్రలో కనిపించే అవకాశమున్నట్లు ఫిలింనగర్‌లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం చిరంజీవి న్యూ లుక్ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా, అభిమానులు మెగాస్టార్ స్టైల్, ఫిట్‌నెస్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# భస్మ హారతిలో పాల్గొన్న తమన్నా



స్టార్ హీరోయిన్స్ ఎంత గ్లామర్ రంగంలో ఉన్నా కూడా భక్తిమార్గాన్ని వదలరు. తమ పనుల్లో బిజీగా ఉన్నా కూడా ఖాళీ చేసుకొని మరీ దైవదర్శనాలు చేస్తూ ఉంటారు. తాజాగా అందాల మిల్కీ బ్యూటీ తమన్నా సైతం ఆధ్యాత్మికత వైపు మొగ్గుచూపుతోంది. తనదైన ఎనర్జీ తో యూత్‌నుఆకట్టుకుంటున్న స్టార్‌హీరోయిన్, భక్తిమార్గంలో అడుగు లు వేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.తాజాగా తమన్నా ఉజ్జయిని మహాకాళేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రానికి వచ్చి స్వామివారిని దర్శించుకుం ది. తెల్లవారుజామున జరిగే అతి పవిత్రమైన భస్మహారతిలో ప్రత్యక్షం గా పాల్గొని,మహాకాలుడికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. సంప్రదా యబద్ధమైన ఎరుపు చీరలో ఆలయనియమాలన్నీ కఠినంగా పాటిస్తూ, భక్తితో మహాకాలుడిని దర్శించుకుంది. తమన్నాను అక్కడ చూసినవా రంతా ఆశ్చర్యపో యారు.నిర్మాత ప్రజ్ఞా కపూర్‌తో కలిసి తమన్నా ఆలయానికి వచ్చింది. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు.. ఆయన పిలుపు అందినప్పుడే మనం ఈ క్షేత్రానికి వస్తాము. స్వామివారి దర్శనం తనకు ఎంతో ప్రశాంతతను, ఆధ్యాత్మిక శక్తిని ఇచ్చింది అని చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్ క్వీన్‌కి భక్తి కూడా ఎక్కువే అంటూ నెటిజన్లు, ఫ్యాన్స్ ప్రశంసలతో ముంచేస్తున్నారు. ఇక ఆలయం విషయానికి వస్తే...ఉజ్జయిని మహాకాల్ ఆలయంలో ప్రతి రోజు తెల్లవారుజామున జరిగే ఈ భస్మ హారతి హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన క్రతువు. పవిత్ర భస్మతో శివలింగాన్ని అభిషేకం చేయడం ద్వారా జననం, మరణం, పునర్జన్మ అనే కాలచక్రాన్ని సూచిస్తారు.

# కార్తీ సినిమాకు మరో తెలుగు దర్శకుడు



కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్‌తో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రంలో కార్తీకి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తోం ది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా షూటింగ్ కొనసాగుతోంది. కాగా ఈ చిత్రానికి మరో దర్శకుడు పనిచేయబో తున్నాడన్న వార్త ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది. మిరాయి, ఈగల్ సినిమాలను డైరెక్ట్ చేసిన కార్తీక్ ఘట్టమనేని ఈ మూవీకి సినిమాటోగ్రఫీ చేయబో తున్నాడు. దీంతో కార్తీక్ ఘట్టమనేని ఇక సినిమాటోగ్రఫర్ కమ్ డైరెక్టర్‌గా మారిపోయాడన్నమాట. టాలీవుడ్‌లో ‘మ్యాడ్’, ‘మ్యాడ్ స్క్వేర్’చిత్రాలతో సూపర్ హిట్స్‌అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్ కార్తీతో కమర్షియల్ ఎంటర్‌టైనర్ తెరకెక్కిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీపై అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. కార్తీకి తెలుగులో ఉన్న క్రేజ్, కళ్యాణ్ శంకర్ మార్క్ హ్యూమర్ టచ్‌తో రాబోతున్నఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

## చిరంజీవి సినిమాల్లో రెండు సార్లు ఆఫర్లు వచ్చినా వదులుకున్నా: ఇంద్రజ

90వ దశకంలో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన ఇంద్రజకు మెగాస్టార్ చిరంజీవి పక్కన నటించాలనే కోరిక బలంగా ఉండేదట. ఆమె కోరుకున్నట్టుగానే చిరంజీవితో నటించే అవకాశం ఆమెకు రెండు సార్లు వచ్చింది. అయితే, చిరంజీవి పక్కన ఛాన్స్ వచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. మొదటిసారి ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన ‘అల్లుడా మజాకా’ సినిమాలో చిరంజీవి చెల్లెలి పాత్ర కోసం ఆమెను సంప్రదించారు. కానీ, చిరంజీవి పక్కన హీరోయిన్‌గా నటించాలని వేయాలని ఆశించిన ఇంద్రజ, చెల్లెలి పాత్ర కావడంతో ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించింది. ఆ తర్వాత ఎడిటర్ మోహన్ దర్శకత్వంలో రూపొందిన ‘హిట్లర్’ సినిమాలో రాజేంద్ర ప్రసాద్ సరసన నటించే అవకాశం వచ్చింది. అయితే అప్పటికే మరో సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం వల్ల డేట్స్ కుదరక ఆ ఛాన్స్‌ను కూడా వదులుకోవాల్సి వచ్చింది. ఇలా రెండు గొప్ప అవకాశాలు చేజారినందుకు ఇప్పటికీ చిన్న అసంతృప్తి ఉందని ఆమె చెప్పుకొచ్చింది.



Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209.“
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411